సాక్షి
ప్రకాశం

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

మెడికల్ కాలేజీని ప్రైవేట్ పరం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ధ్వజమెత్తారు. - 8లో..



మద్యానికి డబ్బులివ్వలేదనే చిత్రవధ

మద్యం తాగడానికి డబ్బులివ్వలేదనే కారణంతో భర్త బాలాజీ, అతని బంధువులు హింసించి చంపేందుకు యత్నించారని బాధిత మహిళ భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

19న 'ఛలో మెడికల్ కాలేజ్' జయప్రదం చేయండి

ఒంగోలు సిటీ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 19న మార్కాపురం మెడికల్ కాలేజీ వద్ద విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో తలపెట్టిన 'ఛలో మెడికల్ కాలేజ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 19వ తేదీన మార్కాపురం మెడికల్ కాలేజీ వద్దకు శాంతియుతంగా పెద్ద ఎత్తున తరలివెళ్లి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేసేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జీ 20 శిఖరాగ్ర సమావేశంలో పాకల ఉపాధ్యాయుడు



విజయానంద్

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు విజయానంద్ న్యూఢిల్లీలో జరుగుతున్న జీ 20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతున్న సమావేశాల్లో 100 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. 89వ ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ జనరల్ మీటింగ్, ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. పాఠశాల స్కూల్ అసిస్టెంట్, పాఠశాల స్టాండర్డ్ క్లబ్ మెంటార్ అయిన విజయానంద్‌కు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ నుంచి సమావేశంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు.

10 మెడికల్ షాపుల లైసెన్స్ సస్పెన్షన్

ఒంగోలు టౌన్: జిల్లాలో 10 మెడికల్ షాపుల లైసెన్స్‌లను సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా డ్రగ్ కంట్రోల్ శాఖ లైసెన్సింగ్ అథారిటీ ఉత్తర్వుల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన తనిఖీల్లో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తనిఖీల్లో కొనకనమిట్ల, దర్శి, పొదిలి, మార్కాపురం, కనిగిరి ప్రాంతాలతో పాటుగా ఒంగోలులోని ఒక మెడికల్ షాపులో డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్-1940ను ఉల్లంఘించినట్లు నిర్ధారించినట్లు వివరించారు. ప్రజారోగ్యం, ఔషధ వినియోగంలో నిబంధనల పాటించకపోవడం, అక్రమంగా నిల్వ చేసిన ఔషధాలను విక్రయించడం వంటి కారణాలతో ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు.

యూటీఎఫ్ బైక్‌జాత ర్యాలీని జయప్రదం చేయండి

ఒంగోలు సిటీ: జిల్లాలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న యూటీఎఫ్ రణభేరి బైక్‌జాత ర్యాలీని జయప్రదం చేయాలని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ హై, వీరాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అపరిష్కృతంగా మిగిలిపోయిన ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి జాత నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా చేపట్టిన బైక్‌జాత ఈ నెల 18, 19 తేదీల్లో కనిగిరి నుంచి ప్రారంభమై గిద్దలూరు, బేస్తవారిపేట, మార్కాపురం, కొనకనమిట్ల, పొదిలి, దర్శి, తూర్పు గంగవరం, చీమకుర్తి, మీదుగా ఒంగోలుకు చేరుకుంటుందని తెలిపారు. జాతలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసన

- విద్యుత్ కార్మికుల కార్యాచరణ జేఏసీ



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఒంగోలు మెట్రో: విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసనలు కొనసాగిస్తామని విద్యుత్ కార్మికుల కార్యాచరణ జేఏసీ స్పష్టం చేసింది. విద్యుత్ కార్మికుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మూడో రోజు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అపరిమిత వైద్య సౌకర్యం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, సమాన పనికి సమాన వేతన, కాంట్రాక్టు సిబ్బందికి పీఆర్‌సీ అరియర్స్, జేఎల్‌ఎం గ్రేడ్-2లను రెగ్యులర్ చేయడం, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా జేఏసీ చైర్మన్ హరికృష్ణ, కన్వీనర్ వెంకటరవి, బెల్లంకొండ సురేష్, తేళ్ల అంజయ్య, రాఘవరెడ్డి, దుర్గా ప్రసాద్, జబ్బర్, ఆనందరావు, రంగమన్నార్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంక్షల చట్రం.. సాగుకు గ్రహణం

నల్ల బర్లీ పొగాకు చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన భరోసా ఇది..

వాస్తవంగా నల్ల బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కుబడిగా కొనుగోలు చేయడమే కాకుండా వచ్చే ఏడాది నుంచి దీనిని సాగు చేయొద్దంటూ రైతులపై ఆంక్షలు పెడుతోంది చంద్రబాబు ప్రభుత్వం. ఇందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం రైతులను కలవరపరుస్తోంది.



నల్ల బర్లీ రైతు నట్టేట మునిగిపోతున్నాడు. కొనుగోళ్ల విషయంపై ప్రభుత్వం మొక్కుబడి చర్యలు..పచ్చనేతలు పచ్చజెండా ఊపిన రైతుల వద్దే కొనుగోలు చేస్తుండడం.. మరోవైపు సాగు సమయంలో రైతులకు హామీలిచ్చిన కంపెనీలు కొనుగోలు సమయంలో మోసం చేయడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అసలే ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన రైతులపై ప్రభుత్వం వచ్చే ఏడాది నుంచి సాగుచేయొద్దంటూ ఆంక్షలు పెట్టడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. గత సంవత్సరం క్వింటా రూ.18000 పలికితే.. నేడు సగం ధర కూడా రాలేదు.

- నల్ల బర్లీ సాగుచేయొద్దంటూ ప్రభుత్వం ఆంక్షలు
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- పచ్చనేతలు జెండా ఊపిన వారి వద్ద నుంచే కొనుగోళ్లు
- ముఖం చాటేసిన కంపెనీలు
- రూ.12 వేలకు కొనుగోలు అంటూ రైతులకు రూ.6 వేలే ఇచ్చిన మార్క్‌ఫెడ్
- రూ.రెండు వేలకు తెగనమ్ముకున్న రైతులు
- ఇంకా రైతుల వద్ద 2,300 టన్నుల పొగాకు నిల్వలు

చీమకుర్తి: పొగాకులో మూడు రకాలున్నాయి. ఒకటి ఎఫ్‌సీవీ (ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా), రెండో రకం వైట్ బర్లీ, మూడోది బ్లాక్ బర్లీ(నల్లబర్లీ). వీటిలో ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు కేవలం పొగాకు బోర్డు ద్వారా మాత్రమే జరుగుతాయి. మిగిలిన వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ పొగాను అమ్ముకోవాలంటే రైతులు ప్రైవేటు కంపెనీలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ సంవత్సరం జిల్లాలోని 19 మండలాలలో 1480 మంది రైతులు నల్లబర్లీ పొగాకు సాగుచేస్తామని మార్క్‌ఫెడ్ కంపెనీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారు 6,668 ఎకరాలలో సాగు చేస్తామని చెప్పారు. అలా సాగు చేయటంతో దాదాపు జిల్లాలో 63,253.14 క్వింటాళ్లు అంటే 6,325 టన్నుల నల్లబర్లీ పొగాకును 19 మండలాలలోని 480 మంది రైతులు పండించినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారుల వద్ద ఉన్న గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి.

కొనుగోళ్లలో దగా...

నల్లబర్లీ కొనుగోలు విషయంలో ప్రభుత్వం సైతం రైతులను దారుణంగా మోసం చేసింది. కంపెనీలు రిజిస్టర్ చేసుకున్న రైతుల దగ్గర నుంచి ప్రారంభ ధర క్వింటా రూ.4,200 నుంచి రూ.7000 వరకూ కొనుగోలు చేశాయి. ఇక ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.12 వేలకు కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేసింది. అయితే రైతులకు మాత్రం రూ.6 వేలు మాత్రమే చెల్లించి దగా చేసింది. కొలుగోలు చేసిన వాటిలో అత్యధికంగా తక్కువ రకం కొనుగోలు చేసి రైతులను చీకటి దెబ్బ కొట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కంపెనీలు, మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయగా మిగిలిపోయిన పొగాకును రూ.2 వేల నుంచి రూ.3 వేలకు తెగనమ్ముకున్నారు. అయినా ఇంకా రైతుల వద్ద పొగాకు మగ్గుతూనే ఉంది. గతేడాది క్వింటా ధర రూ.18 వేలు పలికింది. ఈ సారి అత్యధికం అందులో సగం కూడా రాకపోవడం గమనార్హం.

మండలాల వారీగా నల్లబర్లీ పొగాకు సాగు ఇలా...			
మండలం	రైతులు	విస్తీర్ణం	క్వింటాళ్ళు
నాగులుప్పలపాడు	910	4135.3	48903.5
మద్దిపాడు	80	255.92	1838
కురిచేడు	47	176.47	1143.5
సంతనూతలపాడు	12	56.26	495.36
దొనకొండ	137	367.74	3229.28
అర్ధవీడు	16	112.4	129
పొన్నలూరు	07	38.16	239
తాళ్ళూరు	16	344.56	433
ఒంగోలు	01	03	29
చీమకుర్తి	10	30.14	136
జరుగుమల్లి	04	39.11	235
పెద్దారవీడు	04	08.07	55
రాచర్ల	93	579.64	1980
పామూరు	64	289.57	2178
కొత్తపట్నం	09	31.04	478
ముండ్లమూరు	41	134.51	1143
పొదిలి	02	03.39	13.5
టంగుటూరు	02	17.2	127
కొమరోలు	25	46.47	468
	1480	**6668.95**	**63253.14**

పచ్చనేతలు పచ్చ జెండా ఊపిన వారికే...

ముఖ్యమంత్రులుగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులతో రాజకీయం చేయలేదు. ఎప్పుడూ లేని సంప్రదాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చింది. నాగులుప్పలపాడు మండలంలోని ముప్పాళ్ల, ఈదుమూడి, ఉప్పుగుండూరులో నల్లబర్లీ పొగాకు సాగుచేసిన రైతులపై కూటమి ప్రభుత్వం పక్షపాతానికి పాల్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లను ఉప్పుగుండూరు ప్లాట్‌ఫాం పేరుతో గుండ్లాపల్లిలో కొన్ని పొగాకు కంపెనీల వారు చేస్తున్నారు. ముప్పాళ్ల, ఈదుమూడి, ఉప్పుగుండూరు గ్రామాలలో తమ పార్టీకి చెందిన రైతుల వద్ద నుంచే కొనుగోళ్లు చేయాలని టీడీపీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. ఆ మేరకే అధికారులు కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దాని ప్రకారం అధికార పార్టీకి చెందిన ఒక్కొక్క రైతు వద్ద 200-300 టన్నుల పొగాకును ఎంత ఉంటే అంత పూర్తిగా ప్రైవేటు కంపెనీలు వారు కొనుగోలు చేశారు. రైతుల వద్ద మిగిలిన పొగాకు కొనుగోలు చేయమంటే కంపెనీలు ముఖం చాటేస్తున్నాయని రైతులు మండిపడుతున్నారు. పొగాకు కొనుగోళ్లలో గతంలో ఎప్పుడూ ఇలాంటి వివక్షత చూపించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

1853 టన్నుల పొగాకు మాటేంటి..?

రైతుల వద్ద మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేసిన 927 మెట్రిక్ టన్నులు, పొగాకు పర్మిషన్ కొరకు రాసిన 500 టన్నులు, ప్రైవేటు కంపెనీలు కొన్నటువంటి సుమారు 3 వేల టన్నులను తీసేయగా రైతుల వద్ద ఇంకా 1853 టన్నుల నల్లబర్లీ పొగాకు గోడౌన్లలో మగ్గిపోతోంది. మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 500 టన్నులకే పర్మిషన్ ఇస్తే మిగిలిన 1853 టన్నుల పొగాకు సంగతేంటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హ్యాండిచ్చిన ప్రైవేటు కంపెనీలు...

నల్లబర్లీ పొగాకు రైతును కంపెనీలు మోసం చేశాయి. సాగు చేసే ముందు కంపెనీల తరఫున ప్రతినిధులు వచ్చి మీరు సాగు చేయండి, మీరు సాగు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేస్తామని హామీలిచ్చారు. వ్యవసాయ శాఖ నిబంధనలను గాలికొదిలేసిన ప్రైవేటు కంపెనీలు మాత్రం కొనుగోలు చేస్తాం.. సాగు చేయండని చెప్పారే తప్ప రైతులతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదు. కంపెనీల ప్రతినిధుల మాట విని రైతులు సాగుచేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసే సమయానికి కంపెనీ ప్రతినిధులు హ్యాండిచ్చారు. కంపెనీ ప్రతినిధులు అందరూ సిండికేట్ అయ్యి రైతుల వైపు తొంగిచూడకపోవడం వలన రైతుల వద్ద సాగు చేసిన నల్లబర్లీ పొగాకు నిల్వలు పేరుకుపోయాయి. ఫలితంగా రైతులు ధర తగ్గించాల్సి వచ్చింది. నల్లబర్లీ పొగాకును హెచ్‌డీఆర్, హెచ్‌డీఎం, హెచ్‌డీఎక్స్ అని మూడు గ్రేడ్‌లుగా విభజించారు. రైతులు సాగుచేసిన పొగాకు 6,325 టన్నులు ఉండగా.. దానిలో ఇప్పటి వరకు ప్రైవేటు కంపెనీలు 3 వేల టన్నుల వరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. రైతుల వద్ద పేరుకుపోయిన మిగిలిన 3,253 టన్నుల పొగాకులో రైతుల ఒత్తిడి మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటి వరకు 927 మెట్రిక్ టన్నుల పొగాకు మాత్రమే కొనుగోలు జరిగాయి. మరో 500 టన్నుల పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి నెల రోజుల క్రితం లేఖ రాశారు. ఇంకా పర్మిషన్ రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన 927 మెట్రిక్ టన్నుల పొగాకులో కూడా నాణ్యమైన హెచ్‌డీఆర్‌ను కేవలం 10.92 శాతం, రెండో రకం నల్లబర్లీ అయిన హెచ్‌డీఎంను 41.83 శాతం, మూడోరకం హెచ్‌డీఎక్స్‌ను 47.24 శాతం చొప్పున కొనుగోలు చేశారు. అంటే నాణ్యమైన పొగాకును తక్కువగా, అత్యంత తక్కువ రకం పొగాకును మాత్రం ఎక్కువగా కొనుగోలు చేసి రైతులను నష్టాల బాటలో నిలబెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టాస్క్‌ఫోర్స్‌తో హెచ్చరికలు

పేరుకేమో అవగాహన సదస్సులు అంటూ జిల్లాలోని నల్లబర్లీ పొగాకు సాగు చేసే రైతులపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోంది. వచ్చే ఏడాది నుంచి నల్లబర్లీ సాగుచేయొద్దని టాస్క్‌ఫోర్స్ కమిటీల పేరుతో హెచ్చరిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారి హెచ్చరికలు చూస్తే ఇక నల్లబర్లీ పొగాకు చరిత్ర రానున్న రోజులలో కాలగర్భంలో కలిసిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. త్రీటైర్ టాస్క్‌ఫోర్స్ కమిటీలతో ఇక నుంచి నల్లబర్లీ పొగాకు సాగుచేయొద్దని రైతులను హెచ్చరిస్తుంటే ప్రస్తుతం ఉన్న పొగాకు అమ్ముడుపోయేదెట్టా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొగాకు రైతులతో రాజకీయాలా

నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లలో అధికార పార్టీ నాయకుల సిఫారసుల మేరకు అధికార పార్టీ నాయకులకు చెందిన నల్లబర్లీని మాత్రమే ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేస్తున్నారు. రైతులను రైతులుగా చూడాలేగానీ.. రాజకీయ పార్టీలను అంటగట్టి విభజించటం సరైన విధానం కాదు. దాని వలన టీడీపీ రైతులకు చెందిన ఒకే ఇంటిలో ఇద్దరు ముగ్గురి నుంచి నల్లబర్లీ పొగాకు 200 నుంచి 300 క్వింటాళ్ల కొనుగోలు చేశారు. పార్టీలకు సంబంధం లేని రైతులను ఇబ్బందిపెడుతున్నారు.

– జెట్టి శ్రీనివాసరావు, నల్లబర్లీ పొగాకు రైతు, ముప్పాళ్ల, నాగులుప్పలపాడు మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

నల్లబర్లీ పొగాకు సాగుచేయొద్దని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన త్రీటైర్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దాని ప్రకారం రానున్న ఏడాది నుంచి నల్లబర్లీ పొగాకు సాగుచేయకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని రైతులకు తెలియజేస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలోని 19 మండలాలలో 1480 మంది రైతులు 6,668 ఎకరాలలో నల్లబర్లీ సాగు చేశారు. దాని ద్వారా 63,253 క్వింటాలు సాగు చేశారు.

– బీ శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

కొనుగోలు పర్మిషన్‌కు కేంద్రానికి లేఖ

మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటి వరకు 972 టన్నుల పొగాకు కొనుగోలు చేయటం జరిగింది. మరో 500 టన్నుల నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్రానికి లేఖ రాసి నెలరోజులైంది. అనుమతి రాగానే దానిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాము.

– హరికృష్ణ, డీఎం, మార్క్‌ఫెడ్, ఒంగోలు

కలెక్టర్‌ను కలిసిన బూచేపల్లి



కలెక్టర్ రాజాబాబును అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సబర్బన్: జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం కలిసి అభినందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం జిల్లాలోని పరిస్థితులపై కొంత సేపు ముచ్చటించుకున్నారు. అనంతరం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

14 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి

ఒంగోలు సిటీ: 14 మందిని ఎంపీడీఓలుగా పదోన్నతి పొందినట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏఓలుగా పనిచేస్తున్న ఆరుగురికి, డిప్యూటీ ఎంపీడీఓలుగా పనిచేస్తున్న ఇద్దరికి, బాపట్ల జిల్లాలో ఏఓలుగా పనిచేస్తున్న ఇద్దరికి, గుంటూరు జిల్లాలో ఏఓగా పనిచేస్తున్న ఒకరు, డిప్యూటీ ఎంపీడీఓలుగా పనిచేస్తున్న ఇద్దరు, పల్నాడులో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఒకరికి పదోన్నతి కల్పించారు. వీరిలో కె.సీతారామయ్య, ఎస్‌కే కాశింపీరా, జీవీ కృష్ణారావు, ఎస్.జాన్ సుందరం, ఎస్.సత్యం, డి.అబ్దుల్ ఖాదర్, వి.ప్రతాప్‌రెడ్డి, ఏ.బాలచెన్నయ్య, ఒ.అన్నమ్మలను ప్రకాశం జిల్లాకు, కేఎస్ మల్లికార్జునరావు, వై.శంకరరావు, డి.జయరాం నాయక్‌లను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు, బి.వరూధుని, కె.ధనలక్ష్మిలను బాపట్ల జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

బాల్య వివాహం నేరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు: బాల్య వివాహం అనేది చట్టప్రకారం నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని దిశగా సమాజం ముందుకు పోవాలన్నారు. బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేసి వాటిని అడ్డుకోవాలని సూచించారు. జిల్లాస్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. జువైనల్ బోర్డు లీగల్ ఆఫీసర్ రత్నప్రసాద్ మాట్లాడుతూ స్త్రీశిశు సంక్షేమ శాఖ తరపున ప్రతి ఒక్క అంగన్‌వాడీ కార్యకర్త క్షేత్రస్థాయిలో బాల్య వివాహాల వివరాలు సేకరించి సంబంధిత వర్గాలకు తెలియజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ మతాలకు చెందిన పూజారులు, పాస్టర్లు, ముల్లాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్



కర్నూలు రోడ్డుపై భారీగా నిలిచిన వర్షం నీరు



ఏకలవ్యనగర్‌లో భారీగా నిలిచిన వర్షంనీరు

దంచికొట్టిన జడివాన

ఒంగోలు నగరంలో బుధవారం ఉదయం వాన దంచికొట్టింది. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల పాటు కురిసిన భారీ వర్షానికి నగరంలోని ప్రధాన రహదారుల్లో పెద్ద ఎత్తున వర్షం నీరు చేరింది. ముఖ్యంగా బస్టాండ్ ఏరియా, అద్దంకి బస్టాండ్, బాపూజీ కాంప్లెక్స్, రిమ్స్ ఆస్పత్రి ఎదుట పెద్ద ఎత్తున వర్షం నీరు నిలవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి, ఒంగోలు



మౌర్య హోటల్ వద్ద..



ఒంగోలు ప్రభుత్వాసుపత్రి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

క్లుప్తంగా

మద్యం మత్తులో ఘర్షణ



మద్యం మత్తులో ఘర్షణ పడుతున్న యువకులు

మార్కాపురం: మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు వ్యక్తిగత కారణాలతో బుధవారం మార్కాపురం పట్టణంలోని గాంధీ పార్కులో ఘర్షణకు దిగారు. పోలీసుల కథనం మేరకు.. షేక్ మహబూబ్ సుబానీ, అతని తండ్రి బాబు కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం మద్యం సేవించి గాంధీ పార్కులో కూర్చుని ఉండగా, అదే సమయంలో నాగరాజు అనే మరో కూలీ వచ్చి అసభ్యకరంగా తిట్టాడు. దీంతో సుబానీ కోపోద్రిక్తుడై నాగరాజుపై దాడి చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటీస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో అప్రెంటీస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రధానాచార్యుడు, సహాయ అప్రెంటీస్ అడ్వైజర్, జిల్లా కన్వీనర్ సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో డీజిల్ మెకానిక్ 37, మోటార్ మెకానిక్ 2, ఎలక్ట్రీషియన్ 9, వెల్డర్ 1, పెయింటర్ 1, ఫిట్టర్ 3, డ్రాఫ్ట్‌మన్ సివిల్ ఒకటి చొప్పున మొత్తం 54 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులకు అప్రెంటిస్ యాక్ట్ ప్రకారం శిక్షణా భృతి చెల్లిస్తామని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 97031 65456ను సంప్రదించాలని సూచించారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్ పి.రాజాబాబు

ఒంగోలు టౌన్: మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. బుధవారం జీజీహెచ్‌లో మహిళల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో మహిళలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. మహిళలు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట , ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ శ్యామల, డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసనాయక్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కల్పించాలి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2000 సంవత్సరం నుంచి ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్లు పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 140 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 169 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు మరణించారని, అందులో ప్రకాశం జిల్లాకు చెందిన 18 మంది ఉన్నారని తెలిపారు. వైద్యం నిమిత్తం రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు చేసినా టీచర్లు మరణించారని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మెడికల్ సౌకర్యం లేనందున రీయింబర్స్‌మెంట్ కల్పించి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్యాచ్చులూ.. తూచ్చే!

రోడ్ల చక్కదనం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని జనం కూడా ఓ నిర్ణయానికొచ్చేశారు.! కొత్త రోడ్ల సంగతి దేవుడెరుగు ముందు గుంతలు పూడ్చండని పల్లెల నుంచి పట్నం వాసుల వరకు నెత్తీనోరు మొత్తుకుంటున్నా కూటమి సర్కారు చెవికెక్కడం లేదు. హడావుడిగా చేపట్టిన ప్యాచ్ వర్క్‌లు ఒక్క వర్షానికే దెబ్బతినడంతో విస్తుపోవడం జనం వంతైంది. పక్క చిత్రంలో కనిపిస్తున్నది జాతీయ రహదారి. కొనకనమిట్ల మండలం మర్రిపాలెం బీసీ కాలనీ వద్ద ఏర్పడిన ఈ గుంతలు ప్రాణాంతకంగా మారాయి. - కొనకనమిట్ల



పెద్దనల్లకాల్వలో వైద్య శిబిరం



సూచనలిస్తున్న వైద్యాధికారి, పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామంలో జ్వరాలు అధికంగా ప్రబలిన వైనంపై బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ, వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. బుధవారం గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న పిల్లల గృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తురిమెళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ వీరభద్రాచారి, డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- పశ్చిమ ప్రకాశంపై వివక్షలో భాగమే ప్రైవేటీకరణ
- ఆమరణ నిరాహార దీక్ష చేసైనా ప్రైవేటీకరణను ఆపుతాం
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఉద్ఘాటన

మార్కాపురం:

వెనుకబడిన పశ్చిమ ప్రకాశాన్ని అభివృద్ధి చేయక పోగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కేటాయించిన మెడికల్ కాలేజీని ప్రైవేట్ పరం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం మార్కాపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 19న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో మెడికల్ కాలేజీ వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మెడికల్ కాలేజీని ప్రైవేటు పరం చేసేందుకు ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 19న యువజన విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో కళాశాలను సందర్శించనున్నట్లు అన్నా పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చే నాటికి 12 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవని, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 17 మెడికల్ కళాశాలలు నిర్మించేందుకు జగనన్న అనుమతులు తీసుకొచ్చారని వివరించారు. ఇప్పటికే 5 కళాశాలల్లో క్లాసులు ప్రారంభమయ్యాయని చెప్పారు. పాడేరు, పులివెందులలో మెడికల్ కళాశాలలను గత ఏడాది నుంచి క్లాసులు జరగాల్సి ఉండగా మెడికల్ సీట్లు అవసరం లేదని ఎన్‌ఎమ్‌సీ బోర్డుకు చంద్రబాబు లేఖ రాయడం దుర్మార్గపు చర్య అని ధ్వజమెత్తారు. నీట్ ర్యాంకు వచ్చిన ప్రతి విద్యార్థి ప్రభుత్వ కళాశాలలోనే ఎంబీబీఎస్ చదువుకోవడానికి ఇష్టపడతారని తెలిపారు. మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ ఏడాది నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభం కావాల్సి ఉందని, అందుకు తగ్గట్టు గత ప్రభుత్వంలోనే మార్కాపురం జీజీహెచ్‌లో బెడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.475 కోట్లు కేటాయించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ ప్రాంతానికి మెడికల్ కళాశాలను మంజూరు చేశారని వివరించారు.

పేదలపై పెను భారం

మెడికల్ కళాశాలను ప్రైవేటుకు కేటాయించి ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడం సమంజసం కాదని అన్నా రాంబాబు పేర్కొన్నారు. మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రైవేటు పరంకాకుండా అడ్డుకునేందుకు నిరసనలు, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమని ప్రకటించారు. వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశంలో మెడికల్ కాలేజీ ప్రైవేటు పరం కాకుండా అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు కృషి చేయాలని కోరారు. శ్రీకృష్ణ కమిటీ దొనకొండలో రాజధానిని ఏర్పాటుచేయాలని కోరిందని, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వారి సూచనలను పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పశ్చిమ ప్రాంతంపై వివక్ష తగదని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేందుకే ఈ ప్రాంతంలో గ్యాస్ ప్లాంట్లు కడతామని చెబుతున్నారని, సాగునీరు, పరిశ్రమలు లేని ఈ ప్రాంతంపై జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకుంటామన్నారు.



చలో మెడికల్ కాలేజీ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అన్నా రాంబాబు, పార్టీ నాయకులు

పార్టీ శ్రేణులు తరలిరావాలి

శుక్రవారం నిర్వహించనున్న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొనాలని అన్నా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సలీమ్, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, సిరాజ్, కొత్త కృష్ణ, చాటకొండ చంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మక్బుల్ బాషా, నాయకులు రామసుబ్బారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పి.చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, గొలమారి సత్యనారాయణ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదనే చిత్రవధ

- భర్త చేతిలో హింసకు గురైన యువతి ఆవేదన



చికిత్స పొందుతున్న భాగ్యలక్ష్మి

తర్లుపాడు: మద్యం తాగడానికి డబ్బులివ్వలేదనే కారణంతో భర్త బాలాజీ, అతని బంధువులు తనను అపహరించి, తీవ్రంగా హింసించి చంపేందుకు యత్నించారని తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడుకు చెందిన బాధిత మహిళ భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. తీవ్ర గాయాలతో కదలలేని స్థితిలో ఉన్న భాగ్యలక్ష్మిని మంగళవారం రాత్రి పోలీసులు చికిత్స నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మద్యానికి బానిసైన తన భర్త అప్పులు చేయడమే కాకుండా వేరే మహిళతో కలిసి ఇతర ప్రాంతాల్లో ఉంటున్నాడని తెలిపింది. కూలీనాలీ చేసుకుని నలుగురు పిల్లలను పోషించుకుంటున్నానని కన్నీటి పర్యంతమైంది. కాగా ఘటనకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తర్లుపాడు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న మహిళా సంఘ సభ్యులు

మార్కాపురం: తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు గ్రామంలో భార్యను హింసించిన ఘటనలో బాలాజీతోపాటు సహకరించిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సంఘ ప్రధాన కార్యదర్శి కె.రమా దేవి కోరారు. బుధవారం ఆమె మార్కాపురంలోని వైద్యశాలకు వెళ్లి బాధిత మహిళను పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించకుంటే మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆమె నలుగురు పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘ నాయకులు భూలక్ష్మి, శారా, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను 24 గంటల్లో అరెస్ట్ చేస్తాం

- సీఐ వెంకటేశ్వర్లు



సంఘటనా స్థలంలో దర్శి డీఎస్పీ, పొదిలి సీఐ

పొదిలి: తర్లుపాడు మండంలోని కలుజువ్వలపాడులో భార్యను హింసించిన సంఘటనకు సంబంధించి నిందితులందరినీ 24 గంటల్లో అరెస్ట్ చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ విలేకర్లతో మాట్లాడారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితురాలితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నామన్నారు. భార్యను క్రూరంగా హింసించేందుకు భర్తకు సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లతో గాలిస్తున్నట్లు చెప్పారు.

హైవే మార్జిన్‌లోకి దూసుకెళ్లిన లారీ

- బోల్తా పడిన లారీలో 30 టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు



లారీ నుంచి బయట పడిన పీడీఎస్ బియ్యం బ్యాగ్‌లు

మద్దిపాడు: జాతీయ రహదారిపై గుట్టుగా తరలిపోతున్న బియ్యం అక్రమ రవాణాను లారీ డ్రైవర్ నిద్ర మత్తు రట్టు చేసింది. బియ్యం లోడ్‌తో వినుకొండ నుంచి చెన్నై వైపు వెళ్తున్న 14 చక్రాల లారీ బుధవారం మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి ఫ్లయ్ ఓవర్ సమీపంలో హైవే మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. రోడ్డు పక్కన 2 విద్యుత్ స్తంభాలను తాకుతూ సుమారు 20 మీటర్ల దూరంలోని గదులను బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ క్రమంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీలో తరలిస్తున్నది పీడీఎస్ బియ్యంగా గుర్తించి సీజ్ చేశారు. లారీలో 25 కేజీల పరిమాణం గల 1200 బ్యాగ్‌లు ఉన్నాయని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

అద్దె పేరుతో ఆగమనం.. చోరీ చేసి పలాయనం!

- కిలేడీని కటకటాల్లోకి నెట్టిన తాలూకా పోలీసులు
- నిందితురాలి నుంచి రూ.7 లక్షల సొత్తు స్వాధీనం



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయకృష్ణ, ఎస్సైలు హరిబాబు, ఫిరోజ్

ఒంగోలు టౌన్: ఇల్లు అద్దెకు కావాలని నటిస్తూ ఒంటరి మహిళే లక్ష్యంగా చోరీలకు తెగబడుతున్న ఒక మహిళను ఒంగోలు తాలూకా పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. బుధవారం స్థానిక తాలూకా పోలీసు స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితునాలి వివరాలను సీఐ విజయకృష్ణ వెల్లడించారు. నగరంలోని సుజాత నగర్ 3వ లైనులో పుష్పవతి అనే రిటైర్డ్ ఉద్యోగి ఒకరు ఒంటరిగా నివసిస్తున్నారు. ఆమె ఇంట్లో ఓ పోర్షన్ ఖాళీగా ఉండటంతో టు లెట్ బోర్డు పెట్టారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం గుర్తు తెలియని మహిళ ఇల్లు అద్దెకు కావాలని వచ్చింది. ఇల్లు చూడాలని చెప్పడంతో పుష్పవతి ఆమెకు ఇంటి లోపలికి తీసుకెళ్లారు. ఇదే అదునుగా పుష్పవతిని తోసేసి ఆమె మెడలోని బంగారు చైను, చేతి గాజులు లాక్కుని విజయలక్ష్మి పరారైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన బొందిలి విజయలక్ష్మిని నిందితురాలిగా గుర్తించారు. బుధవారం నిందితురాలిని ఆరెస్టు చేయడంతోపాటు రూ.7 లక్షల విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో ఎస్సైలు హరిబాబు, ఫిరోజ్ పాల్గొన్నారు.

పొంగిన వాగులు వంకలు



సీతారాంపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దోమలేరు



దాసళ్లపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పిల్లగుండ్ల వాగు

హనుమంతునిపాడు: మండలంలో బుధవారం ఉదయం కురిసిన కుండపోత వర్షానికి మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండలంలోని ముప్పాళ్లపాడు, దాసళ్లపల్లి, రామాయిపల్లి, కూటాగుండ్ల, చిన్నగొల్లపల్లి, వాలిచర్ల, హనుమంతునిపాడు, హాజీపురం, వెంగపల్లి, సీతారాంపురం , దొడ్డిచింతల, నరవగోపాలపురం గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి దోమలేరు పొంగి ప్రవహించింది. ముప్పాళ్లపాడు, దాసళ్లపల్లి వద్ద కొండ్రికొండ నుంచి వచ్చే పిల్లగుండ్ల వాగు కూడా పొంగి ప్రవహించింది. ఇటీవల వర్షం లేక ఉక్కపోతతో అల్లాడుతుండగా ఒక్కసారిగా భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహించడంతో గ్రామస్తులంతా వాగుల వద్దకు వెళ్లి ఆసక్తిగా తిలకించారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. ఈ వర్షం కంది, మినుము, అలసంద పంటలకు అనుకూలమని రైతులు చెబుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ప్రమాదంలో మృత్యువాత పడ్డ రాముడు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాకేష్



తాటిచెర్ల వద్ద ప్రమాదంలో మృతి చెందిన రమణ

- కర్నూల్ ఘాట్‌లో అడవి పంది ఢీకొని ఒకరు..
- కొమరోలు మండలం తాటిచెర్ల వద్ద ట్రక్ ఢీకొని మరొకరు..
- శ్రీశైలం ఘాట్‌లో బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్రగాయాలు

పెద్దదోర్నాల: బైక్‌పై వెళ్తున్న ఓ గిరిజనుడిని అడవి పందులు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దదోర్నాల మండలంలోని పెద్ద మంతనాల సమీపంలో బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దమంతనాలకు చెందిన కుడుముల రామన్న గత కొన్ని నెలలుగా యర్రగొండపాలెంలో నివాసం ఉంటూ బొగ్గుల బట్టీలు నిర్వహిస్తున్నాడు. బుధవారం వేకువజామున వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామమైన పెద్దమంతనాల వస్తున్నాడు. గ్రామ సమీపంలో వేగంగా రోడ్డు దాటుతున్న అడవి పందులు రామన్న బైక్‌ను ఢీకొట్టడంతో ఎగిరిపడి అక్కడికక్కడే మరణించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో బైక్ అదుపు తప్పి..

బైక్ అదుపు తప్పి బోల్తా పడటంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం శ్రీశైలం ఘాట్‌రోడ్ లోని బోడేనాయక్ తండా వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. నంద్యాల జిల్లా నందికొట్కూర్‌కు చెందిన రాకేష్ బైక్‌పై శ్రీశైలం వెళ్తుండగా ఘాట్ రోడ్డులో అదుపు తప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాకేష్‌ను అదే మార్గంలో ప్రయాణిస్తున్న శ్రీశైలం వైఎస్సార్ సీపీ నాయకులు ఒట్టి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా బంధువు భరత్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు గమనించారు. తమ కారును వెనక్కు మళ్లించి క్షతగాత్రుడి పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఓ అంబులెన్స్‌లో కర్నూలు తరలించేందుకు సహకరించి మానవత్వం చాటుకున్నారు.

తాటిచెర్ల వద్ద పాదచారుడు మృతి

కొమరోలు: నడుచుకుంటూ స్వగ్రామానికి వెళ్తున్న వ్యక్తిని వేగంగా వెళ్తున్న ట్రక్ ఢీకొనడంతో మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. తాటిచెర్ల గ్రామానికి చెందిన బొమ్మని రమణ(42) గిద్దలూరు హమాలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం కూడా గిద్దలూరులో పని ముగిశాక మోటు వరకు చేరుకున్నాడు. అక్కడి నుంచి నడుచుకుంటూ తాటిచెర్ల వెళ్తున్న సమయంలో మినీ ట్రక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రమణను 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.